క్లుప్తంగా

## సంపద కేంద్ర నిర్మాణ పనుల పరిశీలన



నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

**సి.బెళగల్:** మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మాణ పనులను అధికారులు పరిశీలించారు. ఎస్సీ కాలనీ సమీపంలోని మంచినీటి బావి వద్ద 10 సెంట్ల స్థలంలో సంపద తయారీ కేంద్రం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మంగళవారం ఈఓఆర్డీ ఈశ్వరయ్యసామి పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఉపాధిహామీ ఏపీఓ రామన్న, జేఈ రంగస్వామి, పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణి, టీఏ గోవర్ధన్ ఉన్నారు.

## చౌడేశ్వరీదేవికి సారె సమర్పణ



సారెను సమర్పిస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

**కోడుమూరు రూరల్:** కోడుమూరులో వెలసిన చౌడేశ్వరీదేవి తిరునాలను పురస్కరించుకుని మంగళవారం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి స్థానిక టీడీపీ నాయకులతో కలిసి అమ్మవారికి సారె సమర్పించారు. స్థానిక కొత్తబస్టాండ్ నుంచి అమ్మవారి దేవాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు రవీంద్రగౌడ్, బడేసాగౌడ్, గోపాల్‌నాయుడు, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు అందుబాటులో ఉండాలి



సంగాల సచివాలయంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

**సి.బెళగల్:** గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీఓ రాణెమ్మ అన్నారు. మంగళవారం సి.బెళగల్ మండల పరిధిలోని సంగాల గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు రిజిస్టర్, కార్యాలయ నిర్వహణ రికార్డులను పరిశీలించారు. అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమయపాలన పాటించాలని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నివేదికలు, సర్వేలను సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు.

## ఎన్‌సీడీడీ సర్వేను పకడ్బందీగా చేపట్టండి



వివరాలు పరిశీలిస్తున్న జగదీష్‌చంద్రారెడ్డి

**పాణ్యం:** వైద్య సిబ్బంది నిర్వహించే ఎన్‌సీడీడీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎఫ్‌డీపీ నంద్యాల జిల్లా అధికారి జగదీష్‌చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం కౌలురు ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం చేస్తున్న ఇంటింటి సర్వేలో భాగంగా ప్రతి కుటుంబానికి సంబంధించి దీర్ఘకాలిక వ్యాధులు, ఇతర వ్యాధులు ఉన్నాయా లేదా అనే విషయాన్ని పకడ్బందీగా పరీక్షలు చేసి నమోదు చేయాలని సూచించారు. అంతే కాకుండా కుటుంబ సభ్యుల సమక్షంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అలసత్వం వహించరాదన్నారు.

## మిర్చి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

**ఆదోని రూరల్:** మిర్చి రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి అన్నారు. మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో మిర్చి రైతుల జిల్లా సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మిరప రైతులను ఆదుకోకుండా కాలయాపన చేయడం మంచిది కాదన్నారు. మిరప ధరలు రోజురోజుకు తగ్గిపోతున్నాయని, దీంతో రైతులు అప్పుల పాలవుతున్నారన్నారు. మిరప పంటకు గిట్టుబాటు ధరలు అందించాలన్నారు. బ్యాడిగ మిరపకు రూ.50 వేలు, మిగతా రకాలకు క్వింటాల్‌కు రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిర్చి రైతులను ఆదుకోవాలని కోరుతూ ఈనెల 17వ తేదీన జిల్లావ్యాప్తంగా అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ తెలిపారు.

# గానుగ.. ఆరోగ్య కానుక

- ఆరోగ్యానికి మేలు చేస్తున్న గానుగ నూనె
- గ్రామీణ ప్రాంతంలో విద్యుత్ అవసరం లేని పరిశ్రమ
- నాణ్యమైన నూనె తయారీ
- సొంతంగా ఉపాధి పొందుతున్న యువకుడు



గానుగ ద్వారా ఆముదం నూనె తీస్తున్న దృశ్యం

**గడివేముల:** ఉన్నత చదువులు చదివిన యువదంపతులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆరోగ్యకరమైన వంట నూనెను ప్రజలకు అందించడంతో పాటు ఉపాధి పొందుతున్నారు. అందుకు కొయ్య గానుగ పరిశ్రమను ఎంచుకున్నారు. పూర్వం గ్రామీణ ప్రాంతాల్లో గానుగ ఆడించి నూనె తీసేవారు. ఆ నూనెను వినియోగిస్తే ఎలాంటి రోగాలు దరి చేరేవి కాదు. ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో విద్యుత్ గానుగల వాడకం పెరిగింది. క్రమేణ ఎద్దులు, బర్రెలతో కొయ్య గానుగలు అంతరించిపోయాయి. ప్రస్తుతం నాణ్యమైన ఆహార పదార్థాలు దొరికే పరిస్థితి లేదు. ముఖ్యంగా వంటనూనెల కల్తీ అంతా ఇంతా కాదు. ఏది ఒరిజనలో.. ఏది కల్తీదో తెలియని పరిస్థితి. కల్తీ ఆహార ఉత్పత్తుల కారణంగా జనం అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ క్రమంలో ప్రజలకు స్వచ్ఛమైన ఆముదం నూనెను పాత పద్ధతిలో తయారు చేస్తున్నారు. తల్లిదండ్రుల నుంచి నేర్చుకుని బర్రె కొయ్య గానుకతో వంట ఆముదం తయారు చేస్తున్నారు. వారి ప్రయత్నం ఫలించడంతో మంచి ఫలితాలు సాధించి ఉపాధి పొందుతున్నారు.

### నాణ్యతలో మేటి

కొయ్య గానుగలో అవసరమైన ఆముదాల విత్తనాలు తెచ్చి నూనె తీస్తారు. ఎద్దులు, దున్నపోతులను వినియోగించి గానుక తిప్పుతారు. ఒకసారి గానుగ ఆడడానికి 18 కిలోల గింజలు వేస్తారు. 2 గంటల నుంచి 2.30 గంటల వరకు నూనె తీయడానికి సమయం పడుతుంది. ఇందులో ఉష్ణోగ్రత చాలా తక్కువ ఉండడం వల్ల నూనెలోని పోషకాలు మెండుగా ఉంటాయి. బర్రెల కొయ్య గానుగలో ఆడే నూనెతో దేవుళ్లకు దీపారాధన చేయడానికి, పూజలకు వాడతారు. చిన్నపిల్లల తలకు వంట ఆముదం వాడితే ఆరోగ్యంగా ఉంటారని వినియోగదారులు చెబుతున్నారు.

### పెరిగిన డిమాండ్

గ్రామాల్లో పూర్వం విశ్వ బ్రాహ్మణులకు కులవృత్తి అయిన కొయ్యలతో వివిధ రకాల వ్యవసాయ పరికరాలైన మడకలు, ఎద్దులబండ్లు, కొయ్య గానుగ తయారు చేసి ఉపాధి పొందేవారు. వ్యవసాయ యంత్రాలు వినియోగంలోకి రావడంతో కుల, చేతి వృత్తులు తయారు చేసేవారికి ఉపాధి కరువైంది. గానుకు అవసరమైన కొయ్యను సొంతంగా తయారు చేసుకుంటున్నారు.

### ఇంటి దగ్గరే ఉపాధి



కుటీర పరిశ్రమగా బర్రె, ఎద్దుల కొయ్య గానుగను ఎంచుకున్నాను. ఇంటి దగ్గర ఉంటూ బర్రెల కొయ్య గానుగతో ఆముదం నూనె తీసి ఉపాధి పొందుతున్నాం. గడివేముల గ్రామంలో ఏకైక గానుక ఉంది. నాణ్యమైన ఆముదాల గింజలను రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నాం. ప్రతి నిత్యం ఉదయం నుంచి సాయంత్రం వరకు రోజుకు నాలుగు నుంచి ఐదు లీటర్ల స్వచ్ఛమైన ఆముదం తయారు చేస్తున్నాను. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తే బాగుంటుంది. చుట్టు పక్కల మండలాల నుంచి వచ్చి ఆముదాన్ని కొనుగోలు చేస్తున్నారు. కిలో రూ.400 వరకు అమ్ముతున్నాం. కావాల్సిన వారు ఇంటి వద్దకే వచ్చి కొనుగోలు చేస్తుంటారు.

–దూదేకుల పులిబాషా, గడివేముల

## కాల్వబుగ్గలో ఎద్దుల బండలాగుడు పోటీలు

**ఓర్వకల్లు:** మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో మార్చి 1వ తేదీ అంతర్రాష్ట్ర ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు బజార్, కేవీ మధు, విజయకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుగ్గరామేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. పాలపళ్ల విభాగంలో గెలుపొందిన వృషభ యజమానులకు వరుసగా రూ.లక్ష, రూ.80 వేలు, రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల ఎద్దుల యజమానులు అదే రోజు ఉదయం 8 గంటలలోగా రూ.800 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే మార్చి 2వ తేదీ న్యూకేటగిరి ఎద్దుల బండలాగు పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.1.50 లక్షలు, రూ.1.30 లక్షలు, రూ.1.10 లక్షలు, రూ.90 వేలు, రూ.70 వేలు, రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేస్తామన్నారు.. ఆసక్తి గల ఎద్దుల యజమానులు రూ.1000 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7969464141, 8309165221 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మాణానికి స్థల పరిశీలన



తిమ్మందొడ్డిలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**సి.బెళగల్:** మండల పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం (ఎస్‌డబ్ల్యూపీసీ) నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని మండల అధికారులు పరిశీలించారు. నాగులదిన్నె గ్రామానికి వెళ్లే దారిలో ఎంపిక చేసిన స్థలాన్ని ఎంపీడీఓ రాణెమ్మ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం, వీఆర్వో శ్రీనివాసులు మంగళవారం పరిశీలించారు. కాగా రెవెన్యూ అధికారులు చూపించిన స్థలం గ్రామానికి దూరంగా ఉండడంతో అనువుగా లేదని, మరో స్థలం ఎంపిక చేయాలని ఎంపీడీఓ రెవెన్యూ అధికారులకు సూచించారు. దీంతో మారోమారు స్థల ఎంపిక అసంపూర్తిగా మిగిలింది. చాలా కాలంగా గ్రామంలో స్థల సమస్యతో చెత్తసంపద కేంద్రం నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

## కొలతల ప్రకారం పనిచేస్తే గరిష్ట వేతనం



చిల్లబండలో కూలీల హాజరును పరిశీలిస్తున్న ఏపీఓ

**కోడుమూరు రూరల్:** ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం కూలీలు పనులు చేయాలని ఏపీఓ మోదీన్‌బాషా సూచించారు. మంగళవారం మండలంలోని చిల్లబండ గ్రామంలో ఉపాధి పథకం కింద జరుగుతున్న పనులను తనిఖీ చేసి కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించారు. ఏపీఓ మాట్లాడుతూ.. కూలీలంతా ప్రతి రోజు ఉదయాన్నే పనుల్లోకి రావాలని, ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజు వారి వేతనం రూ.300 వరకు పడుతుందన్నారు. కూలీలు చేసే పనుల్లో నాణ్యత ఉండేలా ఉపాధి సిబ్బంది చూడాలని ఏపీఓ ఆదేశించారు. అలాగే గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలు ముందుకొస్తే వారందరికి ఉపాధి పథకం కింద పనులు కల్పించడం జరుగుతుందని సూచించారు.

## రైతులకు గుర్తింపు సంఖ్య



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

**సి.బెళగల్:** ఫార్మర్ రిజిస్ట్రీతో ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారని, రైతులు వివరాలను ఆయా గ్రామ రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ అన్నారు. మంగళవారం వ్యవసాయ సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం, చింతమానుల పల్లె సచివాలయంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. రైతులకు ఆధార్ తరహాలో 14 అంకెల గుర్తింపు సంఖ్య ఇస్తారన్నారు. దీని ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలు, పథకాలు అందజేస్తారని తెలిపారు. అనంతరం రైతులకు వివిధ పంటల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ హిమబిందు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఘంటసాల గానం అజరామరం

**కర్నూలు కల్చరల్:** పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వర రావు గానం అజరామరం అని వక్తలు కొనియాడారు. పద్మశ్రీ ఘంటసాల గానకళా సమితి ఆధ్వర్యంలో మంగళవారం చిల్డ్రన్స్ పార్క్ సమీపంలోని ఘంటసాల విగ్రహం వద్ద ఆయన 51వ వర్ధంతిని నిర్వహించారు. డాక్టర్ డబ్ల్యూ సీతారాం, డాక్టర్ భవానీప్రసాద్, డాక్టర్ పి.చంద్రశేఖర్, డాక్టర్ బి.శంకర్ శర్మ, డాక్టర్ ఎ.నగేష్, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తిఓబులయ్య పాల్గొని ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. సినీ గీతాలకు, లలిత గీతాలకు గొప్ప గౌరవాన్ని తెచ్చి పెట్టిన మధుర గాయకుడు, సంగీత దర్శకుడు ఘంటసాల అన్నారు. ఐక్యరాజ్య సమితిలో గీతాలాపన చేసి ఆంధ్రులకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిన ఆ మహానుభావుడి గాన మాధుర్యాన్ని భావితరానికి అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఘంటసాలకు భారత రత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. పద్మశ్రీ ఘంటసాల గాన కళా సమితి అధ్యక్షుడు సుస్వరం వాసు దేవమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాయకులు సుధారాణి, ఎలమర్తి రమణయ్య, సమితి కార్యదర్శి రాఘవేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్రను పండుగలా నిర్వహించాలి

- గూగుల్ మీట్‌లో జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి



గూగుల్ మీట్ ద్వారా మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

**కర్నూలు (అర్బన్):** స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌ను, పూర్తయిన ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల వద్ద ఈనెల 15వ తేదీన (మూడవ శనివారం) ప్రజాప్రతినిధులతో పండుగ వాతావరణంలో నిర్వహించాలని జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి అన్నారు. ఆయన మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో జీఎస్‌డబ్ల్యూఎస్, ఎస్‌బీఎం యాక్టివిటీస్‌పై గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరితగతిన ఆస్పైరింగ్ విలేజెస్‌ను రైజింగ్ విలేజెస్‌లా, అనంతరం రైజింగ్ విలేజెస్‌ను మోడల్ విలేజెస్‌గా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు. రోజువారీగా ఇచ్చిన జీఎస్‌డబ్ల్యూఎస్ యాక్టివిటీస్ అయిన మిస్సింగ్ సిటిజన్స్, క్యాప్చరింగ్ ఆఫ్ హౌస్ ఇమేజ్, జియో కోఆర్డినేట్స్, ఎన్‌పీసీఐ యాక్షన్ టోకెన్, ఎన్‌పీసీఐ ఇనాక్టివ్, ఈ-కేవైసీ ఆన్ పీఏసీ, 0-6 సంవత్సరాల పిల్లలకు ఆధార్ కార్డుల జనరేషన్‌కు సంబంధించి లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేసి తద్వారా కర్నూలు జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని సూచించారు. డీపీఆర్‌సీ కో-ఆర్డినేటర్ మంజుల వాణి పాల్గొన్నారు.



అమ్మవారి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు



ప్రత్యేక అంకరణలో ఎల్లమ్మ

## ఎల్లమ్మకు విశేష పూజలు

**కర్నూలు(రూరల్):** నగర సమీపంలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. కుంకుమార్చన, ఆకుపూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

## పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారం

**ఓర్వకల్లు:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాగునీటి సమస్యతో విద్యార్థులు అవస్థలు పడేవారు. ఈ విషయాన్ని పాఠశాల హెచ్‌ఎం రామచంద్రారెడ్డితో పాటు ఉపాధ్యాయులు రిటైర్డు ఐజీ, మాజీ ఎమ్మెల్సీ షేక్ మహ్మద్ ఇక్బాల్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆయన సొంత ఖర్చుతో పాఠశాలలో మంచినీటి ట్యాంక్‌ను నిర్మించి కొళాయిలను ఏర్పాటు చేశారు. మంగళవారం మహ్మద్ ఇక్బాల్‌తో పాటు పాఠశాల పూర్వ విద్యార్థులు గుట్టపాడు మోహన్‌రెడ్డి, కర్నూలు మాజీ కార్పొరేటర్ సురేంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. మానవతాదృక్పథంతో మంచినీటి ట్యాంక్‌తో పాటు కొళాయిలను నిర్మించి విద్యార్థుల దాహార్తిని తీర్చిన ఇక్బాల్ సేవలు మరువలేనివని కొనియాడారు. కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు నాగేంద్రమ్మ, భాస్కర్, చంద్రశేఖర్‌రాజు, మురళీకృష్ణ, శివప్రసాద్, హరి ప్రసాద్, పద్మజ పాల్గొన్నారు.

## ప్రతి గిరిజన కుటుంబానికి సొంతిల్లు

–కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యే గౌరు చరిత

**పాణ్యం:** ప్రతి గిరిజన కుటుంబానికి సొంతిల్లు ఉండాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, ఎమ్మెల్యే గౌరు చరితా అన్నారు. మంగళవారం సాయంత్రం చెంచుకాలనీలో నూతనంగా మంజూరైన గృహ యజమానులతో మాట్లాడారు. ఎవరూ పూరిగుడిసెలో ఉండరాదన్నారు. కాలనీకి సంబంధించి ప్రస్తుతం 167 మందికి గృహాలు మంజురు కాగా 10 మంది గృహాలు ప్రారంభించినట్లు తెలిపారు. మంజూరైన ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం చెంచులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలను తప్పకుండా బడికి పంపాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మంచి ఆహారం, ఉచితంగా పుస్తకాలు, దుస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. సారా తయారీకి దూరంగా ఉండాలని హితవుపలికారు. స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొంది చిన్న తరహా పరిశ్రమలు, చేతివృత్తులపై ఆసక్తి చూపాలన్నారు. మహిళలకు అన్ని విధాలుగా ఆర్థిక సహకారాలను అందిస్తున్నట్లు తెలిపారు. హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, ఈఈ శ్రీహరిగోపాల్, డీఈ విజయ్‌బాబు, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీ ప్రవీణ్‌కుమార్, ఏఈ శ్రీనివాసులు, సర్పంచ్ మేకల పల్లవి పాల్గొన్నారు.

## పోక్సో కోర్టు స్పెషల్ పీపీగా శ్రీనివాసులు



**కర్నూలు:** కర్నూలు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కర్నూలు న్యాయవాది సి.వి.శ్రీనివాసులును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన 1999 సంవత్సరం నుంచి న్యాయవాదిగా వృత్తి నిర్వహిస్తున్నారు. శ్రీనివాసులు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మూడు సంవత్సరాల పాటు కొనసాగనున్నారు. ఆయన నియామకం పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు



ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు :** ప్రతిభ ఆధారంగానే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు వస్తాయి తప్ప మధ్యవర్తుల ద్వారా రావని, ఈ విషయాన్ని నిరుద్యోగ యువత గుర్తుంచుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. నిరుద్యోగ యువత దళారుల మాటలు నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఉద్యోగాల పేరుతో దళారులు నిరుద్యోగ యువతను నమ్మించి మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ద్వారా పోటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయన్నది గుర్తుంచుకోవాలన్నారు. సాఫ్ట్‌వేర్, బ్యాంకు ఉద్యోగాలు, సచివాలయ ఉద్యోగాలు, హోంగార్డు ఉద్యోగాలు, కోర్టు, ఫుడ్ కార్పొరేషన్ ఉద్యోగాలంటూ పలు రకాలుగా దళారులకు డబ్బులు ఇచ్చి మోసపోతునే ఉన్నారని పేర్కొన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని మాయ మాటలు చెప్పి డబ్బులు వసూలు చేసేవారి సమాచారాన్ని తెలియజేయాలని, అలాంటి వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

## గర్భిణులకు వైద్య పరీక్షలు



వైద్య సేవలను పరిశీలిస్తున్న నోడల్ అధికారి రఘు

**కర్నూలు(రూరల్):** గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని నోడల్ అధికారి రఘు అన్నారు. మంగళవారం గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా 32 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెలా 9వ తేదీ షుగర్, హెచ్‌ఐవీ, బ్లడ్ గ్రూపింగ్, హిమోగ్లోబిన్ తదితర పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. రక్తహీనత నివారణకు క్రమం తప్పకుండా ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యే వరకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. డాక్టర్లు హేమలత, అబ్దుల్ హమీద్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

– సర్వసభ్య సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే



రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**గడివేముల:** ప్రభుత్వ అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నాగమద్దమ్మ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ పనుల కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలను తిప్పుకోకుండా వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదన్నారు. మండలాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవన్నారు. త్వరలోనే అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మరమ్మతు పనులు ప్రారంభిస్తామన్నారు. అంతకు ముందు గడివేములలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు సేవా కేంద్రంతో పాటు కంది మద్దతు ధర కేంద్రాన్ని ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ వాసుదేవ గుప్తా, ఏఓ హేమసుందర్‌రెడ్డి, ఎంఈఓ మేరీ సునీత, వైస్ ఎంపీపీ కాలునాయక్, ఎంపీటీసీ మహేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు అంజనమ్మ, రామ్మోహన్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, శేఖర్, వెంకటేశ్వర్లు, నాయకులు సత్యంరెడ్డి పాల్గొన్నారు.

## ముగిసిన నిరహార దీక్ష



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

**పాణ్యం:** మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు తలపెట్టిన 48గంటల నిరాహార దీక్ష మంగళవారంతో ముగిసింది. నియోజకవర్గ కేంద్రమైన పాణ్యంలో అనేక సమస్యలు ఉన్నాయని, ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతోనే జటిలమవుతున్నాయని తెలిపారు. ప్రధానంగా పాణ్యం బస్టాండ్‌లో ప్రయాణికులకు మరుగుదొడ్లు, తాగునీరు లేవన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు కాంపౌండ్‌వాల్ నిర్మించాలన్నారు. ఏపీ మోడల్ స్కూల్, కస్తుర్బా గాంధీ పాఠశాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. బలపనూరు, తమ్మరాజుపల్లె, సుగాలిమెట్ట వద్ద హైవేలో విద్యార్థులు రోడ్డు దాటేందుకు వంతెనను నిర్మించాలన్నారు. సాయంత్రం దీక్ష శిబిరం వద్దకు చేరుకున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందించారు. వివిధ పార్టీలు, సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, పాండురంగ యాదవ్, షేక్‌ఫరిదాబీ, అరుణకుమార్, శివక్రిష్ణయాదవ్, వెంకట్రాది, ప్రతాప్, రాజు, నాగరాజు, మహేష్, సురేష్‌యాదవ్, రామ్మోహన్‌యాదవ్, రాజునాయుడు, ఓబులేసు, షేక్ రియాజ్, వెంకట్, సంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు ఆస్పత్రిలో డీఎంహెచ్‌ఓ తనిఖీ

**కర్నూలు(హాస్పిటల్):** కర్నూలు నగరంలోని నంద్యాల రోడ్డులో ఉన్న సాయి మేఘా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, స్కానింగ్ కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ తనిఖీ చేశారు. హాస్పిటల్, స్కానింగ్ కేంద్రంలోని రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని హాస్పిటల్స్, స్కానింగ్ కేంద్రాలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని యాజమాన్యాలను ఆదేశించారు. వైద్యుల అర్హత సర్టిఫికెట్లు డిస్‌ప్లే చేయాలని, లింగనిర్ధారణ పరీక్షలు చేయరాదని హెచ్చరించారు. అలా చేసిన వారిపై పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామన్నారు. హాస్పిటల్, స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్ కోసం అన్ని అర్హతా ప్రమాణాల ప్రకారం దరఖాస్తు చేయాలన్నారు. ఆమె వెంట డెమో శ్రీనివాసులు శెట్టి, ఆరోగ్య విద్యాబోధకులు పద్మావతి ఉన్నారు.

## ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లించాలి

- నెలాఖరులోపు చెల్లించకపోతే జరిమానా
- మార్చి 1 నుంచి 25 శాతం, ఏప్రిల్ నుంచి 50 శాతం పెనాల్టీ
- నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ

**కర్నూలు (టౌన్):** నగరపాలక సంస్థ పరిధిలో వ్యాపారాలు చేసే ప్రతి యజమాని తప్పనిసరిగా 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ట్రేడ్ లైసెన్సు ఫీజులను ఈనెల 28వ తేదీలోపు చెల్లించి సర్టిఫికెట్ తీసుకోవాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ణీత గడువు దాటితే జరిమానా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మార్చి 1వ తేదీ నుంచి 25 శాతం పెనాల్టీ చెల్లించాలని, అలాగే ఏప్రిల్ 1 తరువాత ట్రేడ్ లైసెన్సు ఫీజుతో పాటు 50 శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ట్రేడ్ లైసెన్సు ఫీజు కట్టిన షాపులకు సర్టిఫికెట్ జారీ చేస్తామని తెలిపారు. ఈ సర్టిఫికెట్ ద్వారా కరెంట్ మీటర్, బ్యాంకు ద్వారా రుణం, లేబర్ ఆఫీసు నుంచి లేబర్ సర్టిఫికెట్ సులువుగా పొందవచ్చని వివరించారు. నిబంధనలు పాటించకుండా ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లించని వ్యాపారుల షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. చట్ట ప్రకారం బకాయి ఉన్న ట్రేడ్ లైసెన్సు ఫీజులను వసూలు చేస్తామని పేర్కొన్నారు.